# గొప్పవాడివైపోతావు!

• యం. యస్. చలం •

గొప్పవాడివి కావాలని వుందా? చెప్పు. సిగ్గుపడకు. సిగ్గు అభ్యుదయ నిరోధకశక్తులలో ప్రధానమైనది. మగవాడివి నీకు సిగ్గెందుకు? అది ఆడవాళ్ళసొమ్ము. అందుకే వాళ్ళకు అభివృద్ధిలేదు. స్త్రీలు సిగ్గువిడిచేస్తే విడాకుల చట్టం వచ్చితీరుతుంది! సిగ్గువిడిచిన ఆడది స్వేచ్ఛాజీవి. కనుక సిగ్గుపడకు.

గొప్పవాడివి అయిపోవాలని వుందికదూ? ఎందుకు వుండదులే! పురుషుడై పుట్టాక అలాంటి కోర్కె లేనివాడెవడు? వుండాలి - ఆకోర్కె తప్పనిసరిగా వుండాలి. వుండితీరుతుంది కూడాను! గొప్పవాడు కావటానికి చాలా దారులున్నై. ఆ సంగతి నీకూ తెలుసు. సువ్యాదారుల వెంట పోగలవా? పోలేవు. అదంతా ముళ్ళబాట. ఆ ముళ్ళబాటను నువ్వు పోలేవు. కాని గొప్పవాణ్ణి అనిపించుకోవాలనివుంది. వుండవలసిందే-

కోర్కె వుంటేగాని సాధన పుట్టుకరాదు. సాధిస్తేగాని ఫలితం చేతికి రాదు. అందుకు గొప్పవాణ్ణి కావాలనే కోర్కె వుండాలి ముందు. తప్పదు.

దేశనాయకుడివి కావాలని వుందికదూ? అదిగో నవ్వుతున్నావు. నాకు తెలుసు- నీకే కాదు యీ కోర్కె చాలామందికి వుందని. పాపం కాలేకపోతున్నావు. కాలేవుకూడాను! ఆ లాటీ పోట్లు నీవు తినలేవు. ఒళ్ళంతా నొప్పి పుడుతుంది. ఒంటరిగా ఆ జైల్లో వుండలేవు; యింతమంది స్నేహితులతో తిరిగినవాడివి. ఇక అక్కడ ఇనుప మేకులూ, పురుగులూ కలిపివండిన ఆ కూడు తినలేవు. మీ అమ్మచేతికూడే నీకు అప్పుడప్పుడు సహించదాయె!

ఇంకా నీకు చాలా కోరికలున్నైలే. గొప్పనటుడివైపోదామనీ, మంచి కథకుడివైపోదామనీ, యింకాయింకా...

నీ జీవితంలో నువ్వు సినిమానటుడివి కాలేవు! సినిమా చూట్టానికి తండ్రిదగ్గర డబ్బులు లాగాలంటే ఎలా నటించాలో తెలియనివాడివి, అంతమంది ప్రేక్షకుల ఎదుట తెరమీద నటించటం అసంభవమైన విషయం!

ఇక నీవు కథకుడివి కావాలని ఎన్నడూ కోరుకోకు. ఎందుకంటే, నీవు రాయాలనుకున్న కథలన్నీ యిదివరకే వ్రాసివేయబడినై! అది నీ తప్పు కాదులే-ఆ వ్రాసినవాళ్లు నీకంటే ముందు పుట్టేరు. నువ్వేం చేస్తావు.

పోనీ ఒకపని చేయగలవ్? కొన్నాళ్ళపాటు భర్తతో కాపురం చేసిన వితంతువును పెళ్లి చేసుకో. ఏం-తలవాల్చావు? ఒక అనాధను సనాధను చేశావనే కీర్తి దక్కుతుంది. ఏమి మాట్లాడవు? ఆమె తొలి సిగ్గులోని మార్దవం, రూపులోని సొగసు యిత్యాదులన్నీ ఎవడో అనుభవించాక నాకెందుకనా నీ సందేహం? అవును- అదికూడా నిజమే-పైగా ఆవిణ్ణి పెళ్లాడినవాడు ఒకడు చచ్చిపోయాడు కనుక రెండోవాడుకూడా వాడిదారినే పోవటానికి అవకాశం వున్నదనేది నీతికోవిదుల ధర్మసందేహమైకూడా వున్నది! కాబట్టి యీ ప్రయత్నం విరమించులే-

పాపం నీవు గొప్పవాడివి కావడానికి అవకాశం ఏ కోశానా కనిపించటంలేదు. గొప్పవాణ్ణి కావాలనే కాంక్ష పూరాగా వుంది. వుండనీ, మరేం ఫర్వాలేదు. గొప్పవాళ్లు కావటానికి సులువైన సూత్రం ఒకటి వుంది. అది తెలియక నువ్వంత

బాధపడుతున్నావు. చెప్పనా మరి ? అదిగో- నీ ముఖాన చిరునవ్వు చిందులాడుతోంది. సరే- విను.

దేశనాయకుడివి కావాలని వుద్దేశకదూ ? అయితే ముందు దేశనాయకులలో గొప్పవాళ్లెవరో నిర్ధారణచేసుకో. ఎవరంటావు ? భేష్-గాంధి ! సరే-నువ్వు గాంధి అంతటివాడివి కావాలి. ఏం చేస్తావు ? ఆయన అంగవస్త్రం కట్టుకున్నాడని నువ్వు గోచితో తిరుగుతావా ? మేకపాలు తాగుతున్నాడని నువ్వు గొర్రెపాలు... మరి వేరుశెనగ పప్పుతింటున్నాడు గదా అని నువ్వు శెనగపప్పు బుక్కుతావు గద ! ఛత్-అలాంటి పిచ్చిపనులేవీ చెయ్యకు. నీ వొంటికి సరిపడవు.

మరేం చేస్తావు ? ఆయన్ని దూదేకినట్టు ఏకు. గాబరాపడకు. అంటే విమర్శించమన్నమాట. విమర్శ ఎలా వుండాలో తెలుసా-మాంచిఘాటుగా వుండాలి. మచ్చుకి కొంత మతలబు చెప్తాను విను.

"ప్రకృతిధర్మానుసారంగా మనిషి ముసలివాడు కావటం సహజం. ఇక ముసలితనంలో మతి తప్పటమనేది ముమ్మాటికి నూటికైన పరమసత్యం. ఈ సందర్భంలో ముసలివాడైన గాంధి భుజస్కంధం మీద కాంగ్రెస్ మహాసంస్థను వుంచటం అవివేకాన్ని ప్రపంచానికే చాటుకోవటం. ఇకనైనా మనం కళ్లుతెరచి గాంధినుంచి కాంగ్రెస్‌సంస్థను ...కాదుకాదు గాంధీనే కాంగ్రెసునుండి సాగనంపాలి." గాంధీ అంతటివాణ్ణి విమర్శించేపాటివాణ్ణా అని సందేహపడకు. పెట్టే ఎసరేదో పెద్దకుండలకే పెట్టాలి మరి !

ఇంకా నీకు తృప్తికలక్కపోతే మరో నాల్గుమాటలు విసురు. "గాంధి బిర్లాచేతిలో మనిషి" అను. తెలివితేటలు బొత్తిగా శూన్యమను. రాజకీయంగా అతని కేమీ తెలియదను. తార్కాణం జిన్నాలో కలిసిపోలేదని చూపించు. ఇది ప్రజాయుద్ధమని పిల్లకాయలు గుర్తించినా, అతడు గుర్తించలేకపోయాడను. పైకి ముసిముసిగా నవ్వుతాడేగాని లోపల ఆ నవ్వులు లేవను. యిలా నీ నోటికొచ్చినట్లు అనెయ్. తాళంవేసేవాడుండడు.

ఈ మాత్రానికే గాంధి అంతటివాణ్ణి అవుతానా ? అని సందేహించకు. మానవస్వభావం కొత్తవాటికోసం పరుగులు తీస్తుందెప్పుడూ - చాలాకాలంనుండి వుంటూవచ్చిన గాంధినాయకత్వం పాతపడిపోయింది గృహిణిలాగ. ఈ సమయాన ప్రజలకు ప్రేయసిలాంటి కొత్తనాయకత్వపు అవసరం ఎంతైనా వుంది. ఈ అవకాశం జారిపోనీకు. ప్రజలు నీ అండ కొస్తారు. నువ్వు గాంధివి ! కాదు యింకా గొప్పవాడివి.

పోతే సినిమానటులనుకూడా యిలానే విమర్శించు. అదేమంత పెద్దపని కాదు. వాడికి నటన చేతకాదను. మాటలు కర్ణకఠోరంగావుంటాయను. ఒక్కమాటలో వాడసలు పనికిరాడనెయ్.

కథకుణ్ణి విమర్శించటంకూడా బాధలేదు. అతని కథల్లో భావం లేదను-శిల్పం కూర్చటమను-స్టయిల్ మంచిది కాదను. ఇలా నీకు తోచినట్లు విమర్శించు. కథకుడుగా, నటుడుగా నీకు పేరు రాకపోయినా , విమర్శకుడివిగా గొప్పవాడివై పోతావు.

ఎవరైనా నిన్ను తిరిగి విమర్శిస్తే ప్రతివిమర్శ చేయకు. అది నీ గొప్పతనానికి దెబ్బకొడుతుంది. మాట్లాడకుండా నీ పని నీవు చేసుకుపో-ఏనుగ పోతూంటే కుక్కలు మొరగవా అనే సామెత క్రిందికి వచ్చేస్తుంది.

అయితే ఒక్కవిషయం ఎన్నడూ మర్చిపోకు. నీ దృష్టిలో కొద్దివాడుగా కనిపించే ఏ వ్యక్తినీ విమర్శించకు. అలా చేశావా-నీ విమర్శవల్ల వాళ్లు ఠపీమని గొప్పవాళ్లయిపోతారు. విమర్శించవలసిన కొత్తవ్యక్తుల్ని నీ అంతట నీవు కొనితెచ్చుకున్న వాడివి అవుతావు.

---

* ఆనందవాణి